సాక్షి
ఖమ్మం

శనివారం। 15। ఫిబ్రవరి। 2025



..కెరీర్ గైడెన్స్ వాల్

గిరిజన విద్యార్థుల ఉన్నతికి చేయూత ఇచ్చేలా 'కెరీర్ గైడెన్స్ వాల్'ను అమలు చేస్తున్నామని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు.

8లో



రూ.100 కోట్ల రాబడి!

బీర్ల ధరలు పెంచడంతో ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖకు రూ.100కోట్ల మేర రాబడి పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 17°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం చలి ప్రభావం ఉంటుంది. ఆతర్వాత మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు

ఖమ్మంలీగల్: విద్యార్థులు చదువు, భవిష్యత్‌పై దృష్టి సారించాలే తప్ప మాదకద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాన్ని అంధకారమయం చేసుకోవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖరరావు సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో 'మాదకద్రవ్య రహిత సమాజం – యువత పాత్ర' అంశంపై శుక్రవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూనే వీటితో దుష్ఫలితాలపై ఇంకొందరికి అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎస్.శాస్త్రితో పాటు వివిధ విభాగాల బాధ్యులు డాక్టర్ ఎం.సునంద, డాక్టర్ బి.వీరన్న, డాక్టర్ సర్వేశ్వరావు, డాక్టర్ ఓంకార్, మధు, న్యాయవాది పి.శరణ్య , తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఆదివారం మొదలుకానుంది. ఈమేరకు స్టేడియంలో శుక్రవారం 17జట్లకు సంబంధించి డ్రా తీశారు. టోర్నీ కన్వీనర్లు ఎం.డీ.మతిన్, సాయినిరంజన్ డ్రా తీయగా 17మండలాల కెప్టెన్లు, కోచ్‌లు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో రాజు, నాగేశ్వరరావు, ఇమ్రాన్, నర్సింహారావు, మురళి, శ్రీను పాల్గొన్నారు.

రాకాసితండా వాసుల ఉపాధికి చేయూత

- రూ.8 లక్షల విలువైన సామగ్రి పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు, అధికారులు

తిరుమలాయపాలెం: గత ఏడాది సెప్టెంబర్‌లో భారీ వర్షాల కారణంగా సర్వం కోల్పోయిన మండలంలోని రాకాసితండా వాసుల ఉపాధి, పునరావాసం కోసం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ముందుకొచ్చింది. ఇందులో భాగంగా వెల్స్ ఫార్గో ఆర్థిక సహకారంతో రూ.8లక్షల విలువైన కుట్టుమిషన్లు, కిరాణషాపు కిట్లు, తోపుడు బండ్లను శుక్రవారం అందజేశారు. తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధితులకు మిషన్లు, కిట్లను తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే, తాగునీటి అవసరాలు తీర్చేలా వెయ్యి లీటర్ల సామర్థ్యంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. ప్రస్తుతం 23 కుటుంబాలకు వంట సామగ్రి, ఏడు కుటుంబాలకు జీవనోపాధి కిట్లు అందించగా, త్వరలో మేకల యూనిట్లు కూడా పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఎస్ఐ రామలింగారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, సంస్థ మేనేజర్ మెరుగు భరత్‌కుమార్, బాధ్యులు కందూరి రాములు, ఏరుకొండ సతీష్, సూర్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

22వరకు మధ్య గేట్ మూసివేత

ఖమ్మం రాపర్తినగర్: మూడో రైల్వే లైన్ పనుల కారణంగా ఖమ్మంలోని కమాన్‌బజార్–గాంధీ చౌక్ మార్గంలో ఉన్న మధ్య గేట్‌ను శుక్రవారం మూసివేశారు. ఈనెల 22వ తేదీ వరకు ఈ గేట్ మీదుగా రాకపోకలకు అనుమతి ఉండదని అధికారులు వెల్లడించారు. కాగా, ఈ గేట్ ద్వారా నిత్యం వందలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈమేరకు మూసివేయడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాల్సి ఉంటుంది.

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో శుక్రవారం మూలమూర్తులు స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అలాగే, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు నిత్యకల్యాణంలో పాల్గొన్నారు.

బకాయిల షాక్..



జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.కోట్లల్లో పేరుకుపోయాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సర్వీసులు కలిపి రూ.598,05,74,000 వరకు పెండింగ్ ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం సమీపిస్తున్న నేపథ్యాన రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) బకాయిలపై దృష్టి సారించింది. మొత్తం బకాయిల్లో ప్రభుత్వ శాఖలవేరూ.559 కోట్ల మేర ఉండడం, ఏటా ఇవి పెరుగుతుండడం గమనార్హం.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

విద్యుత్ శాఖకు రూ.598 కోట్ల బిల్లులు పెండింగ్

- అత్యధికం ప్రభుత్వ శాఖలే.. మిషన్ భగీరథ వాటా రూ.241 కోట్లు
- మొండి బకాయిలు పేరుకుపోతున్నా నోటీసులతోనే సరి
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యాన కదలిక

సర్కారు వారి వాటా రూ.559 కోట్లు

గత కొన్నేళ్లుగా రూ.వందల కోట్లలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. వీటి చెల్లింపులపై ఆయా శాఖలు ఆసక్తి చూపకపోగా, ప్రభుత్వం నుంచీ స్పందన లేకపోవడంతో బకాయిలు పెరుగుతూనే ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు వీటి వసూళ్లపై అప్పుడప్పుడు హడావుడి చేస్తున్నా.. ఆతర్వాత పురోగతి కనిపించడం లేదు. ప్రభుత్వ శాఖల నుంచి రూ.559,96,20,000 రావాల్సి ఉండగా, ఇందులో అత్యధికంగా మిషన్ భగీరథ పథకానికి సంబంధించి రూ.241,99,93,000 చెల్లించాల్సి ఉంది. అలాగే ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.128,32,12,000 బకాయి పేరుకుపోయింది. ఆతర్వాత పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.88,57,97,000 వసూలుకావాల్సి ఉంది.

ఇతర రంగాల నుంచి రూ.38 కోట్లు

గృహ వినియోగదారులు, వ్యవసాయం, పరిశ్రమలు తదితర సర్వీసుల నుంచి సైతం రూ.38,09,45,000 బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇందులో గృహ సర్వీసులు 4,94,011కు గాను రూ.19,05,99,000 బకాయి ఉంది. ఈ బకాయిల్లో గృహజ్యోతి పథకం 2,58,846 సర్వీసులకు రూ.7,63,55,000 బకాయి పేరుకుపోయింది. గృహజ్యోతి ద్వారా వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నా ఆ మేరకు నగదు ప్రభుత్వం నుంచి విద్యుత్ సంస్థకు చేరడం లేదు. అలాగే వ్యవసాయ శాఖలో 1,18,899 సర్వీసులపై రూ.14,41,93,000, పరిశ్రమల సర్వీసులు 4,231కు గాను రూ.4,61,53,000 బకాయి పేరుకుపోయింది. అయితే గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు సంబంధించి బకాయిదారులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. కొన్నిచోట్ల బకాయిలు చెల్లించకుంటే గృహజ్యోతి పథకం పరిధిలోకి రాని సర్వీసులను తొలగిస్తున్నారు. పరిశ్రమలపైనా ఇదే తరహా చర్యలు తీసుకుంటున్నా ప్రభుత్వ శాఖల విషయంలో మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.

ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో..

ఈ ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరిన తరుణాన బకాయిల వసూళ్లపై విద్యుత్ శాఖ దృష్టి సారిస్తోంది. విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి డిస్కం సమర్పించిన నివేదికలో బకాయిల వివరాలనూ పొందుపరిచింది. అత్యధికంగా ప్రభుత్వ శాఖల నుంచే బకాయిలు ఉన్న నేపథ్యాన విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే బకాయిలు చెల్లించనుండడంతో విద్యుత్‌శాఖ నామమాత్రపు చర్యలతో మమ అనిపిస్తోంది. నోటీసులతోనే సరిపెడుతుండడంతో బకాయిలు వసూళ్ల కష్టంగా మారింది.

జిల్లాలో ప్రభుత్వ, ఇతర సర్వీసుల వారీగా విద్యుత్ బకాయిలు

కేటగిరీ	సర్వీసులు	బకాయి (రూ.ల్లో)
గృహ	4,94,011	19,05,99,000
వ్యవసాయం	1,18,899	14,41,93,000
పరిశ్రమలు	4,231	04,61,53,000
పంచాయతీ రాజ్	8,070	88,57,97,000
లిఫ్ట్ ఇరిగేషన్	59	128,32,12,000
మిషన్ భగీరథ	13	241,99,93,000
వైద్యశాఖ	194	6,29,18,000
రెవెన్యూ	110	2,48,50,000
పోలీస్	306	1,92,59,000
ఇతర కార్యాలయాలు		90,00,00,000
రైల్వే శాఖ		36,00,000

వసూలయ్యే దారేది..?

ప్రభుత్వ శాఖల బకాయిలు వసూళ్లకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ప్రతి ఏడాది అధికార యంత్రాంగం ప్రభుత్వ కార్యాలయాల నుంచి విద్యుత్ బకాయిల బిల్లులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయినా ఆశించిన మేరకు వసూళ్లు జరగడం లేదు. బిల్లులు చెల్లించకపోతే ఏం అవుతుందిలే అన్న నిర్లక్ష్య ధోరణి ప్రభుత్వ అధికారుల్లో నెలకొంది. జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులకు అధికంగా విద్యుత్ ఖర్చు అవుతోంది. అయినప్పటికీ బిల్లుల చెల్లింపుపై అధికారులకు పట్టడం లేదు. బకాయిల వసూళ్లపై కూడా విద్యుత్ అధికారులపై ఉన్నతాధికారుల నుంచి అంతగా ఒత్తిడి లేనట్లుగా తెలుస్తోంది. ఇక పంచాయతీలకు సంబంధించి వీధి దీపాలు, మంచినీటి సరఫరాకు విద్యుత్ వినియోగం అధిక మొత్తంలో అవుతోంది.

ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళా సాధికారత

- వ్యాపార ఆలోచనలు అందిపుచ్చుకోవాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందనే అంశాన్ని అందరూ గుర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలు, సెర్ప్ సిబ్బందికి చిన్న తరహా వ్యాపారాల నైపుణ్యాభివృద్ధిపై ఖమ్మంలో రెండు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ శుక్రవారం మొదలైంది. తొలిరోజు మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల బాధ్యులు హాజరైన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక బలం, స్వాతంత్ర్యం ఉంటేనే కుటుంబాలు, ఆపై సమాజం బాగుపడుతుందని తెలిపారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలు ధైర్యం చేయాలని, ప్రారంభంలో సందేహాలు, భయాలు ఉన్నా అధిగమిస్తే క్రమంగా విజయం సొంతమవుతుందని చెప్పారు. మార్కెట్‌లో ఏయూ వస్తువులకు డిమాండ్ ఉంది, మార్కెటింగ్ ఎలా చేయాలనే అంశంపై నైపుణ్యాలు పెంచుకోవాలని, జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధైర్యంగా ముందడుగు వేసే వారికి యంత్రాంగం అండగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ మాట్లాడుతూ తల్లిగా పిల్లలను ఎంత జాగ్రత్తగా పెంచుతారో అదే తరహాలో వ్యాపారాలను అభివృద్ధి చేయడం కష్టమేమి కాదని చెప్పారు. అనంతరం గ్రామీణ వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య, అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దీన్‌తో పాటు సునీత, శివనారాయణ, సీహెచ్.రవీందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

ఖమ్మం సహకారనగర్: అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు రెవెన్యూ విభాగ పర్యవేక్షకుల కోసం ఏర్పాటుచేసిన చాంబర్లను అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించిమాట్లాడారు. డీఆర్వో ఏ.పద్మశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్టేడియంలో సౌకర్యాల కల్పన

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి స్టేడియంను సందర్శించిన ఆయన వాకింగ్ ట్రాక్, ఇతర ప్రాంతాల్లో పరిశీలించి వివరాలు ఆరాతీశారు. ఎన్నికల కోడ్ ముగిశాక అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణం చేపడుతామని చెప్పారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, మేనేజర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మిర్చి క్రయవిక్రయాలపై సమీక్ష

త్వరలోనే 'రైతుబంధు' అమలుకు నిర్ణయం



మిర్చి కాంటా పరిశీలిస్తున్న జేడీఎం శ్రీనివాస్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్రయవిక్రయాలపై శుక్రవారం సమీక్షించారు. మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం. ఏ.అలీం తదితరులు క్రయవిక్రయాలు, ధరల నిర్ణయం తదితర అంశాలపై చర్చించడమే కాక కాంటాలను తనిఖీ చేశారు. నిత్యం 65వేల నుంచి 75 వేల బస్తాలు విక్రయానికి వస్తున్నందున తొలుత షెడ్లు, ఆపై యార్డుల్లో దింపేలా పర్యవేక్షించాలని, జెండాపాట ధర మేరకు కొనుగోళ్లు జరిగేలా పరిశీలించాలని నిర్ణయించారు. కాగా, దడువాయిల విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిశీలించాలని, ఉద్యోగులు కూడా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు.

రైతుబంధు అమలుపై ప్రచారం

పంట నిల్వ చేసి రుణం పొందేందుకు అవకాశమున్న రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని ఖమ్మం మార్కెట్ కమిటీ నిర్ణయించింది. రైతులు పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటే, విలువలో 75 శాతం రుణం పొందేలా ఈ పథకం అమలవుతోంది. 180 రోజుల వరకు వడ్డీ ఉండదని, ఆతర్వాత నామమాత్రపు వడ్డీ విధించనున్నందున విస్తృత ప్రచారం చేయనున్నట్లు వెల్లడించారు.



రాస్తారోకోలో పాల్గొన్న స్థానికులు, నిలిచిన వాహనాలు

సైలోబంకర్‌ను తొలగించాల్సిందే...

రాస్తారోకోకు దిగిన కిష్టారం వాసులు

సత్తుపల్లి: కాలుష్యానికి కారణమవుతూ తమ ప్రాణాలకు ముప్పుగా మారినందున సైలోబంకర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్న సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ వాసులు తమ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. సింగరేణి సైలోబంకర్ నుంచి వెలువడుతున్న దుమ్ముతో శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నందున తొలగించాలని స్థానికులు చేపట్టిన దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. అయితే, అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో స్థానికులు పిల్లాపాపలతో కలిసి ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. దీంతో సత్తుపల్లి, ఖమ్మం వైపు వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోయాయి. అయితే, భారీగా వాహనాలు నిలిచిపోవడంతో సత్తుపల్లి సీఐ కిరణ్, ఎస్సైలు కవిత, వీరేందర్ సిబ్బందితో చేరుకుని నచ్చచెప్పారు. అంతేకాక సింగరేణి పీఓ నర్సింహారావును పిలిపించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్షలు కొనసాగిస్తామని వెల్లడించగా, పోలీసులు సర్దిచెప్పడంతో చివరకు రాస్తారోకో విరమించారు. కాగా, స్థానికుల ఆందోళనకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

గాడి తప్పుతున్న గ్రామీణాభివృద్ధి

- డీఆర్‌డీఏ కార్యాలయంతో పాటు క్షేత్రస్థాయిలోనూ ఆరోపణలు
- సిబ్బంది అవినీతిపై వెల్లువలా ఫిర్యాదులు
- ఒకేసారి నలుగురి సస్పెన్షన్‌తో కలకలం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అంటే ఒకప్పుడు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ఉండేది. ఈ శాఖ ద్వారా ప్రభుత్వం ఏ పథకం అమలుచేసినా జిల్లాలో క్షేత్రస్థాయికి చేరేలా అధికారులు, సిబ్బంది కృషి చేశారు. అయితే, ఇప్పుడు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయ నిర్వహణ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై రెండు, మూడేళ్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం కార్యాలయంలోని సామగ్రిని కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై అమ్ముకున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. విచారణలో ఇది వాస్తవమేనని తేలినా ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్న ఒకరిద్దరు అధికారులు బాధ్యులను వెనుకేసుకొస్తూ చర్యలు తీసుకోకుండానే కప్పిపుచ్చారు. తాజాగా తిరుమలాయపాలెం మండలంలో ఏపీఎం, సీసీల అవినీతి బయటపడడం.. ఒకేసారి నలుగురిపై వేటు వేయడంతో అవినీతి ఏ స్థాయిలో జరిగిందోనన్న చర్చ జరుగుతోంది.

లోకాయుక్తకు ఫిర్యాదుతో..

తిరుమలాయపాలెం మండలంలో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఐకేపీ ఏపీఎం అలివేలుమంగతో పాటు సీసీలు దేవసుందరం, జైపాల్, రేణుకను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని బీరోలు ఐకేపీలో పనిచేసిన గ్రామదీపికను ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓగా నియమించి రెండు పదవులకు సంబంధించిన జీతాలు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, అక్రమంగా నగదు బదిలీ చేయడంపై ఓ వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా, అక్కడి నుండి కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చేవరకు డీఆర్‌డీఏ అధికారులు గుర్తించలేకపోవడం గమనార్హం. కానీ డీఆర్‌డీఏలో కీలకంగా వ్యవహరిస్తున్న ఒకరిద్దరు అధికారులు, సిబ్బందికి ఈ విషయం తెలిసినా ఇన్నాళ్లు బయటకు రానివ్వలేదని, వారం క్రితమే నలుగురిని సస్పెండ్ చేసినా ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడినట్లు శాఖ ఉద్యోగుల ద్వారా తెలిసింది.

విభజించి పరిపాలన..

రాష్ట్ర విభజన సమయాన డీఆర్‌డీలో డ్వామాను నాటి ప్రభుత్వం విలీనం చేసింది. అప్పటి నుంచి అటు సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది, ఇటు డ్వామా (ప్రస్తుతం ఉపాధి హామీ) ఉద్యోగులు, సిబ్బంది ఐకమత్యంగా విధులు నిర్వర్తించారు. కానీ కొన్నాళ్లుగా అధికారులు రెండు వైపులా ఉద్యోగులు, సిబ్బందిని విభజించిట్లుగా విధులు కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న కొందరిలో తమకు అనుకూలమైన వారిని కార్యాలయానికి కేటాయించడం, ఓ అధికారి కేవలం ఇద్దరు, ముగ్గురితోనే అన్ని పనులు చేయిస్తూ అక్రమాలకు తెరలేపారన్న ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది వేతనాల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుండగా, ఇటీవల ఆడిట్‌లో బయటపడకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం. కాగా, కలెక్టరేట్(ఐడీఓసీ)లోని అన్ని శాఖల ఉద్యోగులు సాయంత్రం 5 – 6 గంటల సమయానికి వెళ్లిపోతుండగా డీఆర్‌డీఏలో రాత్రి పొద్దుపోయే వరకు పని చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అధికారులు దృష్టి సారిస్తేనే..

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కొందరు గతంలో అక్రమాలకు పాల్పడిన వారికి కీలక విధులు అప్పగిస్తున్నారని తెలిసింది. ఈ అంశంపై కలెక్టర్ దృష్టి సారిస్తే డీఆర్‌డీఏలో పాలన గాడిలో పడుతుందని ఉద్యోగులు కొందరు కోరుతున్నారు. ఒకప్పుడు పథకాల అమలులో అగ్రగామిగా నిలిచిన జిల్లా ఇప్పుడు ఎందుకు వెనుకబడిందో ఆరా తీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఐకేపీ సిబ్బందిపై వేటు, కార్యాలయ పనితీరుపై వస్తున్న ఆరోపణలపై డీఆర్‌డీఓ సన్యాసయ్యను వివరణ కోరగా.. సస్పెన్షన్ విషయమై దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చారు. ఇక కార్యాలయంలో అంతా బాగానే ఉన్నట్లు బదులివ్వడం గమనార్హం.

ప్రాణం తీసిన గ్రానైట్ రాళ్లు

ముదిగొండ: బతుకుదెరువు కోసం ఊరు కాని ఊరు వచ్చిన ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డారు. గ్రానైట్ రాళ్లు తీసుకెళ్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనం బోల్తా కొట్టగా అందులోని రాళ్లపై కూర్చున్న కార్మికులు కింద పడడం, వారిపై రాళ్లు పడడంతో తీవ్ర గాయాల పాలై మృతి చెందారు. ఇదే ఘటనలో మరో ఆరుగురికి గాయాలయ్యాయి. జిల్లాలోని ముదిగొండ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది.

- డీసీఎం బోల్తా పడడంతో ఇద్దరు మృతి
- బతుకుదెరువు కోసం వచ్చి మృత్యువాత



ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న పోలీసులు

నూనావత్ వీరన్న (ఫైల్)

బానోతు హుస్సేన్ (ఫైల్)

లోడ్ తీసుకొస్తూ...

ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలోని న్యూలక్ష్మీనరసింహ గ్రానైట్ పరిశ్రమలో పలువురు లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం పరిశ్రమ జయమాని గడి రాంబాబు నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలోని గ్రానైట్ పరిశ్రమ నుంచి అన్‌పాలిష్ పీస్‌లు తీసుకురావాలని సూచించడంతో డీసీఎంలో డ్రైవర్‌తో పాటు 9మంది కూలీలు వెళ్లారు. అక్కడ గ్రానైట్ రాళ్లు లోడ్ చేసుకుని కై కొండాయిగూడెం వెళ్లే క్రమాన ముదిగొండ సమీపంలో డీసీఎం డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో వాహనం వెనుక టైర్ల నట్లు ఊడిపోయి అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో గ్రానైట్ రాళ్లపై కూర్చుని వస్తున్న బానోత్ హుస్సేన్(28), నూనావత్ వీరన్న(35)పై రాళ్లు పడగా పొట్టలోకి దిగడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఇదేఘటనలో బానోత్ దాసు, కర్ణ, అశోక్, కుమార్, సుందర్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. ఈమేరకు క్షతగాత్రులను 108వాహనంలో ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు మృతుల కుటుంబీకుల ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు. కాగా, ప్రమాదంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి స్పందించారు. ఇద్దరు కార్మికులు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే, ఖమ్మం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

భోజనానికి వస్తామని వెళ్లారు...

ఖమ్మంఅర్బన్: పొట్టకూటి కోసం ఊరు వదిలి వచ్చి రెక్కల కష్టంతో జీవనం సాగిస్తున్న ఇద్దరు కార్మికుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. డీసీఎం బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందడం, పలువురు గాయపడడంతో ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో మృతుల బంధువుల, క్షతగాత్రుల రోదనలు మిన్నంటాయి. మృతులు హుస్సేన్, నూనావత్ వీరన్న ఖమ్మం కైకొండాయిగూడెంలో అద్దె ఇంట్లో కుటుంబసభ్యులతో నివాసముంటూ ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలో పని చేస్తున్నారు. హుస్సేన్ స్వగ్రామం భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం తొండలబాల తండా కాగా, వీరన్నది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాముతండా. వీరిద్దరు రోజులాగే శుక్రవారం ఉదయం గ్రానైట్ ఫ్యాక్టరీకి వెళ్లగా లోడ్ తీసుకొస్తూ మృతి చెందారు. కాగా, లోడ్ తీసుకురావడానికి వెళ్తున్నాం, పని పూర్తికాగానే భోజనానికి వస్తామని చెప్పిన వారిద్దరూ మృతి చెందారనే సమాచారం తెలియడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మృతదేహాల వద్ద నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులు కోలుకునే వరకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. వివిధ సంఘాల నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, చింతీరల నాగయ్య, బొమ్మకంటి రమేష్, శోభన్, రవి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆయిల్‌పామ్, మామిడిలో సస్యరక్షణపై అవగాహన



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్, వైరా కేవీకే శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సాగుచేస్తున్న మామిడి, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.అలాగే, పట్టుపురుగుల పెంపకంతో లాభాలను వివరించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య, ఏఓ సాయిశివ పాల్గొన్నారు.

18న సబ్ జూనియర్స్ కబడ్డీ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికకు ఈనెల 18న పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీలకు 16ఏళ్ల లోపు వయస్సు కలిగి, బాలురైతే 55 కేజీల లోపు, బాలికలు 55 కేజీల్లోపు బరువు కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని, వివరాలకు 73966 69337 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో శనివారం బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్నూరుకాపు సంఘం నాయకుడు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ ఖమ్మం సప్తపది ఫంక్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 2గంటలకు మొదలయ్యే సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొంటారని వెల్లడించారు. కులగణనలో బీసీల సంఖ్య తక్కువగా చూపించడంతో బీసీలకు అండగా ఎమ్మెల్సీ కవిత పోరాటాలకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈమేరకు సమావేశానికి అన్ని కులాల బాధ్యులు హాజరుకావాలని కోరారు. కాగా, ఉదయం 10గంటలకు జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌ను కవిత పరామర్శిస్తారని, ఆతర్వాత పాండురంగాపురంలోని సేవాలాల్ ఆలయం, బీఆర్ ఎస్ కార్యాలయంలో జరిగే సేవాలాల్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు పవన్‌నాయక్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుల అరెస్ట్

చింతకాని: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్), చింతకానికి చెందిన ఉమ్మనేని రమేష్, లగడపాటి సాయిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు వైరా ఏసీపీ రహమాన్ తెలిపారు. చింతకాని మండలం నాగులవంచలోని పెట్రోల్ బంక్‌లో ఇటీవల జరిగిన ఘర్షణకు సంబంధించి విచారణ నిమిత్తం ఈనెల 11న చింతకాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బోనకల్ వాసి, ఆర్మీ జవాన్ బూదాల మనోజ్‌ను ఉమ్మనేని రమేష్, లగడపాటి సాయి స్టేషన్ ఆవరణలోనే కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. ఘటనపై మనోజ్ చేసిన ఫిర్యాదుతో రమేష్, సాయిపై అట్రాసిటీ కేసు నమోదు చేయగా వీరిద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, కేసు విచారణ నిష్పక్షపాతంగా కొనసాగుతుందని, చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

- దళితులను కొట్టారని ఆరోపణ

చింతకాని: మండలంలోని నాగులవంచ పెట్రోల్ బంక్‌లో కొద్దిరోజుల క్రితం ఘర్షణ జరగగా యాజమాన్యం ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదైంది. అయితే, కేసు నమోదైన వారిలో దళితులు ఉండగా పోలీసులు వారిని విచారణకు తీసుకెళ్లి కొట్టారని ఆరోపిస్తున్నారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం రాత్రి దళిత సంఘాలు, బీఎస్పీ నాయకులు ఆందోళనకు దిగారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే దళితులపై దాడి జరగడం గర్హనీయమని పేర్కొన్నారు. దళితులను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అయితే, పోలీసులు వారికి సర్దిచెప్పి పంపించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, నాయకులుమిర్యాల నాగరాజు, విజయ్, ఉసికల నవీన్ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

రూ.100 కోట్ల రాబడి!

- పెరిగిన బీర్ల ధరతో ఉమ్మడి జిల్లాలో రానున్న ఆదాయం
- 15 నుంచి 20 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- గతేడాది 20 లక్షల కేసుల విక్రయాలతో రూ.400 కోట్లు



పాల్వంచరూరల్: వేసవి కాలంలో అధిక విక్రయాలు జరిగే బీర్ల ధర్లను ప్రభుత్వం పెంచింది. వివిధ కంపెనీల బీర్లపై 15 నుంచి 20 శాతం రేటు పెంచడంతో మందుబాబులపై అదనపు భారం పడనుంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది 20 లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోగా తద్వారా రూ. 400 కోట్ల ఆదాయం లభించినట్లు వైరా బేవరేజస్ కార్పొరేషన్ డీఎం కాశినాథం తెలిపారు. ఇప్పుడు ధరల పెంపుతో రూ.100కోట్లు అదనంగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. శీతాకాలం ముగిసి వేసవిలోకి అడుగుపెడుతున్న తరుణంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో మద్యం ప్రియులు బీర్లవైపు మొగ్గు చూపుతున్నారు. ఆ క్రమంలో బీర్ల ధరలు పెరగడంతో కంగుతిన్నారు. ఒక్కో బీర్‌పై రూ.30నుంచి రూ.40 చొప్పున పెరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో కంపెనీల కమీషన్‌తోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరగనుంది. వేసవిలో సుమారు 25 నుంచి 30శాతం అధికంగా బీర్ల అమ్మకాలు ఉంటాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, పెరిగిన ధరలను ఈ నెల 11 నుంచే అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



పెరిగిన ధరలు ఇలా...

కంపెనీ	పాత ధర	కొత్తధర	పెరిగిన ధర
కింగ్‌ఫిషర్ లైట్ బీరు	150	180	30
కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్	160	190	30
బడ్వైజర్ లైట్‌బీరు	210	250	40
బడ్వైజర్ స్ట్రాంగ్	230	270	40
ఆర్‌సీ లైట్ బీరు	150	180	30
నాకౌట్ బీరు	160	190	30

12వ తేదీ నుంచి అమలు



పెరిగిన బీర్ల ధరల అమలుపై ప్రభుత్వం ఈ నెల 12న ఉత్తర్వులు జారీ చేసింది. ఆలోపు వరకు షాపుల్లో ఉన్న బీర్లను పాతధరలకు మాత్రమే విక్రయించాలి. కొత్త ధరలతో విక్రయించినట్లు ఫిర్యాదు వస్తే వైన్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. పెరిగిన ధరల ద్వారా ఉమ్మడి జిల్లాలో రూ.వంద కోట్ల ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

– జానయ్య, భద్రాద్రి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్



ముదిగొండ మండలంలో శుక్రవారం జరిగిన ప్రమాదస్థలిలో క్షతగాత్రులు

రహదారులపై రక్తపుధారలు

- జిల్లాలో వరుస ప్రమాదాల్లో పలువురి మృతి
- 45రోజుల్లో కన్నుమూసిన 30మంది
- క్షతగాత్రులు 100మందికిపైగానే...

ఖమ్మంక్రైం: జిల్లాలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం, నిబంధనలు పాటించకపోవడానికి తోడు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అంతేకాక మద్యం సేవించి వాహనాలు నడపడం కూడా ఓ కారణమవుతోందని పోలీసులు చెబుతున్నారు. ఈ కారణాల మాటేమో కానీ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, వేగనియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం కూడా ప్రమాదాలకు ఆస్కారమిస్తుందనే వాదన వినిపిస్తోంది. అయితే, కారణాలు ఏమైనా వరుస ప్రమాదాలతో పలువురు మృత్యువాత పడుతుండగా, బయటకు వెళ్లిన వారు తిరిగొచ్చే వరకు కుటుంబీకులు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మృతులు 30మందికి పైగానే..

గత నెల జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలోని జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 30మంది మృతి చెందినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇక క్షతగాత్రుల సంఖ్య 100పైగానే నమోదైంది.

మితిమీరిన వేగం

జిల్లాలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరగడానికి వాహనదారుల మితిమీరిన వేగంతోపాటు ఓవర్ లోడ్, ఓవర్‌టేక్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం సేవించి ఉండడం ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. అంతేకాక జనవరి, ఫిబ్రవరి మొదటి వారం వరకు ఉదయం మంచు ప్రభావం ఉండడంతో వాహనదారులకు అవగాహన లేక ప్రమాదాల బారిన పడ్డారు. జిల్లాలో మిరప కోతలు జోరుగా జరుగుతుండడంతో రైతులు ఒక్కో గ్రామం నుంచి పదుల సంఖ్యలో కూలీలను పిలిపిస్తున్నారు. ఈక్రమాన భారం తగ్గుతుందని ఒక్కో ఆటోలో పది మందికి పైగా ఎక్కిస్తుండడంతో డ్రైవర్లు అందరి ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. జిల్లా నుంచి అటు హైదరాబాద్, ఇటు విజయవాడ వెళ్లడానికి జాతీయ రహదారులు అందుబాటులోకి రావడంతో త్వరగా గమ్యస్థానాలకు చేరాలనే భావనతో నియమాలను పక్కన పెట్టి హైవేలపై దూసుకెళ్తున్నారు. అంతేకాక రాష్ట్ర రహదారులు, నగరాలు, పట్టణాల్లోనూ అతివేగంగా వాహనాలను నడిపి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకొందరు ఎదుటి వారి ప్రానాలనూ బలి తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో లారీలు ఢీకొని మృతి చెందిన ఘటనలు జరిగినప్పుడు డ్రైవర్లు మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించామని రవాణా, పోలీస్ అధికారులు చెబుతున్నారు.

- ఈనెల 7న బైక్‌పై వెళ్తూ పెనుబల్లి మండలం లంకపల్లి సమీపాన జరిగిన ప్రమాదంలో గాయపడిన బీటెక్ విద్యార్థి మరుసటి రోజు మృతి చెందాడు.
- ఈనెల 9న కొత్త బైక్‌కు పూజ చేయించుకుని వస్తుండగా ధంసలాపురం వద్ద కారు ఢీకొట్టడంతో వెనకాల కూర్చున్న వివాహిత మృతి చెందింది
- ఈనెల 10న ట్రాక్టర్ అదుపు తప్పడంతో టైర్ కింద పడిన డ్రైవర్ మృతి చెందాడు.
- ఈనెల 13న కారేపల్లి మండలం మీదుగా ఇల్లెందుకు చెందిన సాయి అనే వ్యక్తి కారులో వెళ్తుండగా కుక్కలను తప్పించే క్రమాన అదుపు తప్పి బోల్తా పడడంతో మృతి చెందాడు.
- ఇదేరోజు 14మంది కూలీతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో మురళి అనే వ్యక్తి మృతి చెందాడు.
- ఇలా జిల్లాలో ఎక్కడో ఓచోట జరుగుతున్న ప్రమాదాల్లో కొందరు మృతి చెందుతుండగా, ఇంకొందరు గాయపడుతున్నారు.

ప్రమాదాల కట్టడికి చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆధ్వర్యాన పోలీస్ శాఖ నడుం బిగించింది. ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి కారణాలను విశ్లేషించి వాటికి అడ్డుకట్ట వేసేలా రహదారులపై సోలార్ బ్లింకింగ్ బారికేడ్లు ఏర్పాటుచేస్తున్నారు. అంతకాక బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్‌లేజర్ గన్స్ సమకూరడంతో తనిఖీలు విస్తృతం చేయాలని నిర్ణయించారు. అయితే, జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 30కిపైగా బ్లాక్ స్పాట్లను గుర్తించినా అక్కడ సూచికబోర్డులు ఏర్పాటుచేయకపోవడం గమనార్హం.

ప్రమాదాల సంఖ్య తగ్గించడానికి కృషి



జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం సేవించి వాహనం నడిపే వారి గుర్తింపునకు తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నాం. అయితే, వాహనదారులు కూడా నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ప్రతిఒక్కరు తమకు కుటుంబం ఉందని గుర్తుంచుకోవాలి.

– శ్రీనివాసులు, ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ

కొత్త ఎస్‌హెచ్‌జీల ఏర్పాటులో అలసత్వం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అటు ప్రభుత్వం, ఇటు అధికారులు నిరంతరం కొత్త పథకాలను అమల్లోకి తీసుకొస్తున్నారు. జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా కొత్త కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఇక మహిళా సంఘాల్లో లేని సభ్యులను గుర్తించి కొత్త సంఘాలు ఏర్పాటుచేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఖమ్మంలోనూ మెప్మా ఆధ్వర్యాన కొత్త సంఘాల ఏర్పాటుకు అధికారులు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించినా సిబ్బంది తీరుతో ఫలితం ఉండడం లేదు. జిల్లాలో 1,200 ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేయాలని ఆదేశించగా, ఈనెల ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 240 సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 100 సంఘాలను కూడా ఏర్పాటు చేయలేదు. ఈ విషయంలో కొందరు ఆర్పీలు ఆసక్తిగానే ఉన్నా అధికారులు, సీఓలు అడ్డుపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. బల్లేపల్లి ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు రెండేళ్లుగా సంఘం ఏర్పాటుకు స్థానిక ఆర్పీని కలిసినా పట్టించుకోవడం లేదని సమాచారం. ఈమేరకు గాంధీచౌక్‌కు చెందిన ఆర్పీ ఆధ్వర్యాన సంఘంగా ఏర్పడి బ్యాంకు ఖాతా తెరిచేందుకు వెళ్తే అధికారులు అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో శుక్రవారం పలువురు మహిళలు కేఎంసీ కార్యాలయానికి వచ్చి అధికారులను నిలదీశారు. బల్లేపల్లి ప్రాంత ఆర్పీతోనే సంఘం ఏర్పాటు చేయించుకోవాలని, ఇతర ఆర్పీలతో ఏర్పాటుకు వీల్లేదని అధికారులు తేల్చిచెప్పడం గమనార్హం. ఈ విషయమై మెప్మా అధికారులను వివరణ కోరగా ప్రాంతాల వారీగా అక్కడి ఆర్పీతోనే సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

మహిళ కడుపులో 5 కిలోల కణితి

- తొలగించిన ఖమ్మం పెద్దాస్పత్రి వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఓ మహిళ కడుపులో పెరిగిన ఐదు కిలోల కణితిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. కోదాడకు చెందిన సునీల తీవ్రమైన కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, ఆయాసంతో బాధపడుతుండగా కుటుంబీకులు శుక్రవారం ఖమ్మం ఆస్పత్రిలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు ఐదు కిలోల కణితి ఉందని గుర్తించిన ఆపరేషన్ ద్వారా తొలగించారు. శస్త్రచికిత్సలో గైనిక్ హెచ్‌ఓడీ యామిని, ప్రొఫెసర్ డాక్టర్ అపర్ణతో పాటు డాక్టర్ రాధిక, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రిషిక పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలో మెడికల్ కళాశాల ఏర్పాటయ్యాక ఇంత పెద్ద కణితిని తొలగించడం ఇదే మొదటిసారని వెల్లడించిన ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు.. క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేసిన వైద్యులను అభినందించారు.

వన దేవతలకు ప్రణమిల్లి..

సమ్మక్క, సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



కరకగూడెం: సమ్మక్క, పగిడిద్దరాజు కల్యాణం జరిపిస్తున్న పూజారులు

కరకగూడెం: గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క, సారలమ్మ జాతర కరకగూడెం మండలంలోని చిరుమళ్లలో నాలుగు రోజుల నుంచి సాగుతోంది. శుక్రవారం వన దేవతలను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం రాత్రి సమ్మక్కకు పగిడిద్దరాజుతో కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ బాధ్యులు ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసి కల్యాణ మహోత్సవాన్ని ప్రదర్శించారు. అర్ధరాత్రి వరకు కూడా భారీగా భక్తులు రావడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా శుంకు పండుగ..

సమ్మక్క సారలమ్మ జాతరలో శుంకు పండుగకు ప్రాముఖ్యత ఉంది. మొదట ధాన్యాన్ని తీసుకొచ్చి వాటిని వన దేవతల గద్దెలపై చేర్చి ఇలవేల్పుల కర్రలను వాటిలో ఉంచి ముగ్గులు పోసి పసుపు, కుంకుమ కలిపి ఒక కోడిని కరిముట్టించి, కొబ్బరికాయ కొట్టి అందులోని నీళ్ల ధాన్యంలో పోసి వచ్చిన భక్తులకు ఇస్తారు. ఈ ధాన్యాన్ని రైతులు వారి పొలంలో వేస్తే పంట బాగావస్తుందని నమ్మకం. శుంకు పండుగగా పిలిచే ఇందులో వివిధ రకాల వంటకాలను ప్రసాదంగా పంచుకుంటారు.

18న బంద్‌కు మావోయిస్టుల పిలుపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసులు మారణకాండ కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ, ఇందుకు నిరసనగా ఈనెల 18న బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ దక్షిణ బస్తర్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సమత పేరిట ఒక లేఖ విడుదలైంది. ఈ నెల 9న బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మావోయిస్టులు సమావేశమయ్యారని ఇన్‌ఫార్మర్లు ఇచ్చిన సమాచారంతో చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు జరిపారని పేర్కొన్నారు. పోలీసుల కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందగా, మరో 19 మంది గ్రామస్తులను బంధించి చిత్రహింసల అనంతరం హత్య చేశారని సమత ఆరోపించారు. ఇదేక్రమాన తోడ్కా గ్రామంలోనూ 8 మంది గిరిజనులను పట్టుకుని హత్య చేశారని వెల్లడించారు. ఈ ఘటనను నిరసిస్తూ 18న బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల బంద్‌ను పాటించాలని ఆమె కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న రైతు మృతి



రాము (ఫైల్)

నేలకొండపల్లి: వ్యవసాయానికి తోడు చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని భావించిన రైతు అందిన చోటల్లా అప్పులు చేశాడు. అయితే, ఎందులోనూ కలిసి రాక అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగిన ఆ రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం మంగాపురంతండా(చిన్నతండా) కు చెందిన తేజావత్ రాము(47) తనకు ఉన్న నాలుగున్నర ఎకరాల పంటలు సాగు చేస్తూనే చేపల చెరువు లీజ్‌కు తీసుకున్నారు. ఇందుకోసం రూ.2.90కోట్ల మేర అప్పులు చేయగా వ్యవసాయం, చేపల పెంపకంలో కలిసి రాలేదు. అయినప్పటికీ రూ.2 కోట్ల వరకు అప్పులు తీర్చినా ఇంకా రూ.90 లక్షల బాకీ ఉంది. ఈ అప్పు తీర్చే మార్గం లేక 7వ తేదీన తన పొలంలో పురుగుల మందు తాగిన రామును కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య శరణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా, రాము కుటుంబాన్ని చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, విద్యుత్ డీఈఈలు ధీరావత్ కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పరామర్శించారు.

ఓసీ సమీపాన..



నాగభూషణం (ఫైల్)

కారేపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఉసిరికాయలపల్లి ఓసీ సమీపాన బొగ్గు కాంటా షెడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. ఏపీలోని ప్రకాశం జిల్లా పామూడు మండలం పుట్టనాయుడుపల్లికి చెందిన చిందె చిన్ననాగభూషణం(42) 20 ఏళ్లుగా ఇల్లెందులో నివాసముంటూ బొగ్గు కాంటా కాంట్రాక్టర్ వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. అయితే, రెండేళ్లుగా డీ-బ్లాక్ నుంచి బొగ్గు రవాణా నిలిచిపోవడం, గుమస్తాలకు ఉపాధి లేకపోవడం.. ఇంతలోనే నాగభూషణం ఇంట్లో ఉన్న కార్యక్రమానికి ఆర్థిక సమస్యలు ఎదురైనట్లు తెలిసింది. దీంతో తాను పనిచేసే కాంటా షెడ్డులోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారని కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి 'కెరీర్ గైడెన్స్ వాల్'



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: పదో తరగతి అనంతరం గిరిజన విద్యార్థుల ఉన్నతి కోసం భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో తొలిసారిగా కెరీర్ గైడెన్స్ వాల్ ప్రారంభిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని ఏజీహెచ్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన విద్యాసంస్థల్లో పదో తరగతి చదువుతున్న బాలికలు ఆ తర్వాత ఉన్నత విద్య, గ్రాడ్యుయేషన్‌లో ఎంపిక చేసుకోవాల్సిన విభాగాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని అన్నారు. ఐటీడీఏ పరిధిలోని ప్రతీ గిరిజన పాఠశాలలో కెరీర్ గైడెన్స్ వాల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ అధికారులు పాఠశాలకు వచ్చి అవగాహన కల్పిస్తారని వివరించారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా బోధించాలని, పరీక్షల్లో ఉత్తీర్ణత, తదుపరి కోర్సులపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పలువురు విద్యార్థినులు భవిష్యత్‌లో తమ లక్ష్యాలను వెల్లడించగా అందుకోసం సిద్ధం కావాల్సిన తీరును పీఓ, అధికారులు వివరించారు.

23న ప్రతిభాపరీక్ష

ఈ నెల23న విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష నిర్వహించనున్నట్లు పీఓ రాహుల్ తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి మొదటి ఐదు స్థానాల విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారికి వాతలపై విచారణ



చిన్నారులతో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గోపాలపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని ఆయా బెత్తంతో కొట్టడంతో వీపుపై వాతలు తేలినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యాన జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) కె.రాంగోపాల్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. సెంటర్‌కు వస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడడమే కాక వాతలు వచ్చినట్లు చెబుతున్న చిన్నారిని పరిశీలించినట్లు డీడబ్ల్యూఓ తెలిపారు. అయితే, అలాంటిదేమీ లేదని తేలగా, గర్భిణులు, బాలింతలు కూడా టీచర్ లక్ష్మి, ఆయా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మేస్తూ 16జీవాలు మృతి



మృతి చెందిన గొర్రెల వద్ద బాధితులు, స్థానికులు

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడు వాసులైన చెందిన బుర్రా వెంకన్న, దొడ్డ ఉపేందర్, దొడ్డ వీరభద్రంకు చెందిన 16 గొర్రెలు, మేకలు శుక్రవారం మృతి చెందాయి. వీరు పదేళ్లుగా గొర్రెల పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. ఇందులో భాగంగా గొర్రెలు, మేకలను శుక్రవారం మేతలకు తీసుకెళ్లగా ఆటోనగర్ సమీపాన గడ్డి మేస్తూ గొర్రెలు మృతి చెందాయి. ఈవిషయమై అందిన సమాచారంతో పశుసంవర్థక శాఖ అధికారులు పరిశీలించగా, నివేదిక వచ్చాక జీవాల మృతికి కారణాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా, రూ.2.40లక్షల విలువైన గొర్రెలు మృతి చెందినందున ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.